www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 12 నవంబర్ 2024

5

అన్నమయ్య

యూత్ ఫెస్టివల్‌లో ప్రతిభ చాటిన జ్ఞానాంబిక విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి

శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నిర్వహించిన అంతర్ డిగ్రీ కళాశాలల యూత్ ఫెస్టివల్ లో శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కళాశాల విద్యార్థులు జానపద గ్రూప్ డాన్స్‌లో బంజారా నృత్యానికి మొదటి స్థానాన్ని, వెస్ట్రన్ సోలో మూడవ స్థానాన్ని, వెస్ట్రన్ గ్రూప్ సాంగ్ లో మూడవ స్థానాన్ని కైవసం చేసుకున్నారని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. వీరు ఎస్ఆర్‌యం యూనివర్సిటీ నిర్వహించు సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్ లో పాల్గొనడానికి అర్హత సాదించారని అన్నారు. వీరిని కళాశాల కరెస్పాండంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి అభినందించారు.

అవార్డులు సాధించిన విద్యార్థులు

నిరాశే!

రాష్ట్రబడ్జెట్-2024-25 బడ్జెట్ తీవ్ర నిరాశను కలిగించింది. జిల్లా ప్రగతికి కీలక రంగాలైన నీటిపారుదల, వ్యవసాయం, పారిశ్రామిక, సేవల రంగాల పురోభివృద్ధికి అవసరమైన కేటాయింపుల్లో స్పష్టత కొరవడింది. ఇందులో రూ.3,848 కోట్లతో సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు ఉప శమనం కలిగించడం మినహా వ్యవసాయ పారిశ్రామిక కేటాయింపులు నిరాశను మిగిల్చాయని చెప్పవచ్చు. జిల్లా జీవనాడిగా పరిగణ పొందిన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, కొప్పర్తి ఎంఎస్‌ఎంఇల పురోగతికి సంబంధించి ఎటువంటి ప్రస్తావన చేయక పోవడం విస్మయాన్ని కలిగించింది. వైఎస్ఆర్ ఎలక్ట్రానిక్ క్లస్టర్‌లో పరిశ్ర మల ఏర్పాటుకు మౌళిక సదుపాయాల కల్పన విస్మరించింది. వ్యవసాయం, సాగునీటి పారుదల, పారిశ్రామిక రంగాలకు నాలుగు నెలలకు సంబంధించిన ఫీజు రియింబర్స్‌మెంట్, తల్లికి వందనం తదితర పథకాల వ్యయాల్ని సైతం నిర్లక్ష్యం చేసినట్లు కనిపిస్తోంది.

- ◆ 'ఉక్కు' ప్రస్తావనే కరువు
- ◆ ఎంఎస్‌ఎంఇ పార్కు గల్లంతు
- ◆ రూ.2,254 కోట్లతో జిఎన్ఎస్ఎస్ పనులు
- ◆ రూ.305 కోట్లతో పిబిసి కెనాల్ కేటాయింపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం రూ.2,94, 425 కోట్లతో 2024-25 బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. జిల్లాకు సంబంధించిన కీలక రంగాల కేటాయింపులను పరిశీలిస్తే తీవ్ర నిరుత్సాహాన్ని కలిగించింది. సాగునీటి రంగ కేటాయింపులను హంద్రీ-నీవా, తుంగభద్ర హైలెవల్ కెనాల్, వెలుగొండ ప్రాజెక్టుల ప్రస్తావనతో సరిపెట్టింది. జిఎన్ఎస్-ఎస్ ఫేజ్-2, నిలిచిపోయిన పెన్నా-కుందూ ఎత్తిపోతలు, వెలిగల్లు ఎత్తిపోతల, ఝరికోన ప్రాజెక్టు పనుల ప్రస్తావన కనిపించలేదు. కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలతో ముడిపడిన జిఎన్ ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్, కెసికెనాల్ కేటాయింపులు చేయకపోవడం ఆందో ళన కలిగించింది. నాలుగు నెలల స్వల్పకాలిక బడ్జెటే అయినప్పటికీ ప్రాధాన్య, ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు కేటాయింపులప్రస్తావన లేకపోవడం విస్మయాన్ని కలిగించింది. 2023-24 బడ్జెట్‌లో సాగునీటి పారుదల రంగానికి రూ.1542.17 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. తాజా బడ్జెట్‌లో ఏమేరకు కేటాయించారనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది. 2022-23 బడ్జెట్‌లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు రూ.2,200 కోట్లు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో ఉక్కు పరిశ్రమ ప్రస్తావనే చేయలేదు. 2022-23 బడ్జెట్‌లో యోగివేమన యూనివర్శిటీకి రూ.32.83 కోట్లు, సిపిబ్రౌన్‌కు రూ.10 లక్షల చొప్పున కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత బడ్జెట్‌లో యోగి వేమన, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ, ఎపి కార్ల్ విద్యా, పరిశోధక సంస్థల ప్రస్తావన కనిపించలేదు. అన్నదాతా సుఖీభవ పథకం కింద రూ.4,500 కోట్లు సున్నావడ్డీ పథకానికి రూ. 687 కోట్లు కేటాయించడంతో ఉమ్మడి జిల్లాలోని 4.80 లక్షల మంది రైతులకు స్వల్ప ఊరట లభించింది. ఇదిలాఉండగా రాష్ట్రంలోని యువతకు ఉద్యోగావకా శాల కల్పనలో స్పోర్ట్స్ కోటా కింద మూడు శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా యువతను ప్రసన్నం చేసు కునే ప్రయత్నం చేసినట్లు కనిపించింది. ఉమ్మడి జిల్లాలోని గండికోట డిస్టిబ్యూటరీలు, అన్నమయ్య పునరుద్ధరణ, పింఛా, ఎల్ఎస్‌పి, నిలిచిపోయిన కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతల పథకాల పనులకు సంబంధించిన కేటాయింపుల ప్రస్తావన చేయకపోవడం విస్మయాన్ని కలిగించింది.

పిట్టల దొర ప్రసంగం..

అసెంబ్లీ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేసిన బడ్జెట్ ప్రసంగం పిట్టల దొర ప్రసంగాన్ని మించి పోయింది. అసెంబ్లీలో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం చూస్తే 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో రూ 2.94 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పారు.మిగతా రూ 1.46 లక్షల కోట్లు ఎక్కడ నుంచి తెస్తారో తెలియడం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి అంత అప్పు చేసేం దుకు నిబంధనలు ఒప్పుకోవు. మరి ఎలా రూ 2.94 లక్షల కోట్లు ఖర్చు చేస్తారో చూడాలి. కూటమి ప్రభుత్వ బడ్జెట్ ప్రసంగం పిట్టల దొర ప్రసంగమే కాని అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ కు విశ్వసనీయత లేదని తులసిరెడ్డి అన్నారు.

- ఎన్.తులసిరెడ్డి, పిసిసి అధికార ప్రతినిధి.

ఆత్మస్తుతి, పరనిందలతో రాష్ట్ర బడ్జెట్

తెలుగుదేశం కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో బడ్జెట్‌లో కనీస ప్రస్తావన చేయకపోగా, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగం ఆత్మస్తుతి, పర నిందతో నిండిపోయింది. రాష్ట్ర ప్రజలకు నిర్దిష్టంగా కలిగే ప్రయోజనాల గురించి ప్రస్తావనే లేదు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీల సంక్షేమానికి నామమాత్రంగా నిధులు కేటాయించడం అన్యాయం. కార్మికుల సంక్షేమ గురించి ఊసే లేదు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలనూ నిరాశపర్చింది.

- శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కన్వీనర్, రాయచోటి.

ఆర్థిక, సామజిక భద్రత లేదు

2024-25 ఆర్థిక సంవత్సరానికి టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ లో కార్మికులకు ఆర్థిక సామాజిక భద్రత కల్పించేదిగా లేదు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం వంటి స్కీమ్ వర్కర్లకు ఐదు సంవత్సరాలు దాటినా వేతనాలు పెంచలేదు. .50 లక్షలమంది షెడ్యూల్ ఎంప్లాయ్ మెంట్స్ లో పని చేసే కార్మికుల వేతనాల పెంపు కూడా విస్మరించారు. అసంఘటిత రంగ కార్మికులకు మొండి చెయ్యి చూపారు. ప్రజా కార్మిక సంక్షేమన్ని దృష్టిలో ఉంచుకొని బడ్జెట్ ప్రతిపాదనల్లో మార్పులు చేయాలి.

- ఎ. రామాంజులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదరి

విద్యావ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడు 'మౌలానా'

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాయచోటి

దేశ విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఆయన 137వ జయంతి సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో భారతరత్న, భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం, జాతీయ మైనారిటీ సంక్షేమ దినోత్సవ వేడుకలను జిల్లా మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు కలెక్టర్, జెసి మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అన్నమయ్య జిల్లాలో మైనారిటీలకు విశేష సేవలు అందించిన షాకీర్ తదితరులకు మొమెంటోలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా ఆజాద్ యుజిసి, ఐఐటి, ఐఐఎంల స్థాపనలో కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజలందరికీ ఉచితంగా విద్య అందాలని ఆయన కోరుకున్నారన్నారు. విద్యావ్యవస్థకు పునాదులు వేయడమే కాకుండా భారత దేశంలో మతసామరస్యానికి కృషి చేశారని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలతో మైనారిటీల అభివృద్ధికి అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ సిబ్బంది, జిల్లాలోని మైనారిటీల నాయకులు, మైనారిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

మొమెంటో అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

'చమర్తి'ని విమర్శిస్తే సహించం

నిరసన తెలుపుతున్న 'చమర్తి' వర్గీయులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజుపై అనవసరమైన నిందలు వేస్తే చూస్తూ ఊరుకోమని చేసిన ఆరోపణలకు తగిన ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలని టిడిపి నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. టిడిపి నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం ఆదివారం ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి వైసిపి నాయకులు ముర రెడ్డి సోదరులు గజమాల కప్పి ఆహ్వానించడంపై ఆవాట్సాప్ వేదికగా చమర్తి,సుగవాసి వర్గీయులు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. ఇందులో భాగంగా తీవ్రంగా స్పందించిన చమర్తి వర్గీయులు తమ నాయకుడిపై చేసిన ఆరోపణలు వాస్తవం అయితే దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని వాట్సాప్ వేదికగా పిలుపునిచ్చి సోమవారం ఎన్‌టిఆర్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశానుసారం జగన్‌మోహన్‌రాజు చివరి నిమిషంలో తమ టికెట్ ను త్యాగం చేశాడని, గెలిచే సీటును చేతగానితనంతో ఓడించుకుని తమ నాయకుడిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు, తర్వాత వైసిపి వాళ్లతో అంట కాగుతూ ఇతరులపై నిందలు వేయడం సిగ్గుచేటని అన్నారు. నాయకులు వస్తారు, పోతారు గాని పార్టీ శాశ్వతంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ కార్యదర్శి అబూబకర్, టిఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, పార్లమెంటు అధ్యక్షులు పోలి శివకుమార్, సతీష్‌రాజు పాల్గొన్నారు.

వైసిపి నాయకులను వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : మండలంలోని గుంటి మడుగుకు చెందిన వైసిపి నాయకుడు రమణారెడ్డి, ఇతర నాయకులను వెంటనే విడుదల చేయాలని వైసిపి రాష్ట్రప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. గుంటిమడుగులో వైసిపి నాయకుల ఇంటి ఎదుట ఫ్లెక్సీలు పెట్టినా సర్దుకుపోయారని అన్నారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారే ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటే ఏమిటని అడిగినందుకు పోలీసులు వైసిపికి చెందిన స్టేషన్‌కు పిలిపించి రాత్రంతా స్టేషన్‌లోనే నిర్బంధించడం హేయమైన చర్యని అన్నారు. గౌరవ ప్రదంగా వ్యవసాయం చేసుకునే రమణారెడ్డి,అమరనాథరెడ్డి, కొంతమంది దళిత యువకులను అక్రమంగా స్టేషన్ లో నిర్బంధించడమే కాకుండా వారిని సిఐ చంద్రశేఖర్ దారుణంగా కొట్టారని ఆరోపించారు. తమ ప్రాంత నాయకులకు ఏమైందోనన్న ఆందోళనతో పోలీసు స్టేషన్ దగ్గరకి వందమందికి దళిత ప్రజలువస్తే, మహిళలు అని కూడా చూడకుండా లాఠీ చార్జీ చేయడం దారుణమన్నారు. సిఐ చంద్రశేఖర్,ఎస్ ఐ నరసింహా రెడ్డి లు ఇద్దరూ కూడా ఇప్పటికీ అక్రమంగా చాలా మందిని హింసిస్తూ దాడులు చేశారన్నారు. వైసిపి నాయకులపట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ఘోర ంగా ఉందంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.దీనిపై చట్టప్రకరంగా ఎదుర్కొంటామని అన్నారు. దీనిపై సిఐ, ఎస్ ఐ లపైన ప్రయివేటు కేసులను ఫైల్ చేస్తున్నామని చెప్పారు. ఈ విషయాన్ని ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లుతామన్నారు. నిర్బంధించిన వారిని వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

వైసిపి సోషల్ మీడియా కార్యకర్త 'వర్రా' అరెస్టు

చింతకొమ్మదిన్నె పోలీసుస్టేషన్ నుంచి కోర్టుకు తరలింపు

నా భర్త అరెస్టు సమాచారాన్ని ఇవ్వలేదు : కల్యాణి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. అతనితోపాటు సుబ్బారెడ్డి, ఉదయ్ అనే మరో ఇద్దరు అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రాత్రి ప్రకాశం జిల్లా మార్కాపురంలో కుంట ఆత్మకూరుకు వెళ్లే మార్గంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సోమవారం తెల్లవారుజమున కడప జిల్లాలోని చింతకొమ్మదిన్నె పోలీ స్స్టేషన్‌కు తరలిఒచారు. కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ కడపకు వచ్చే వరకు విచారించిన అనంతరం సాయంత్రం 4.30 గంటలకు మీడియా ఎదుట హాజరు పరిచారు. అనంతరం కోర్టుకు హాజరుపరిచారు. ఇదిలాఉండగా ఈనెల 5న సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ పవన్‌కల్యాణ్, హోం మంత్రి అనిత, వైఎస్ షర్మిల, వైఎస్ విజయమ్మ, వైఎస్ సునీత, మంద కృష్ణ మాదిగ తదితర నాయకుల మీద అనుచిత పోస్టులు పెట్టారనే పలు ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేసి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. 41(ఎ) నోటీసులు పేరుతో తప్పించుకున్న నేపథ్యంలో ఐదారు రోజులపాటు కర్నూలు, తెలంగాణా సరిహద్దు జిల్లాయైన మహబూబ్‌నగర్‌లో ఈనెల 5న సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు నమోదు చేశారు. ఫిర్యాదుల ఆధారంగా అదుపులోకి తీసుకున్న సందర్భంగా తప్పించుకున్న సంగతి తెలిసిందే. సుమారు వారం రోజులపాటు తెలంగాణా సరిహద్దు ప్రాంతమైన మహబూబ్‌నగర్, రాష్ట్రంలోని కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో గాలింపును పోలీసులు ముమ్మరం చేశారు. లోతైన విచారణ అనంతరం సేకరించిన సమాచారం ఆధారంగా ప్రకాశం జిల్లాలో ఉన్నట్లు గుర్తించి పోలీసులు ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని సోమవారం సాయంత్రం 4.30 గంటలకు మీడియా ఎదుట హాజరు పరిచా మని డిఐజి కోయ ప్రవీణ్, కడప ఇన్‌ఛార్జి ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. నిందితునిపై సింహాద్రిపురానికి చెందిన దళితుని ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీస్టేషన్‌లో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కింద పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇదిలా ఉండగా రవీం ద్రరెడ్డి భార్య, సోదరులు అరెస్టు చేసిన సమాచారం తెలుసుకుని చింతకొమ్మదిన్నె పోలీస్టేషన్ చేరుకుని నిరీక్షించారు. తమతో మాట్లాడ నివ్వకుండానే తరలిం చడం దారుణమని వాపోయారు. అనంతరం వర్రా రవీంధ్రరెడ్డి భార్య కల్యాణి మాట్లాడుతూ తన భర్తను ఈనెల ఐదున అదుపులోకి తీసుకుని ఎక్కడెక్కడో తిప్పి వేధించారని వాపోయారు. నాభర్త ప్రాణానికి ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. సోదరుడు మల్లికార్జునరెడ్డి మాట్లా డుతూ సోదరుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు సమాచారం ఇవ్వలేదన్నారు. మీడియా ద్వారా తెలు సుకుని వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్నటి వరకు సోదరునిపై కేసులు లేవని, ఇప్పటికిప్పుడు కొత్తగా కేసులు ఎలా పుట్టుకొచ్చాయో అర్థం కావడం లేదన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు

- కర్నూల్ రేంజి డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్

ప్రజాశక్తి - కడప అర్బన్

కొందరు ప్రముఖులు వ్యవస్థగా ఏర్పడి అసాంఘిక శక్తులతో పనిచేస్తూ తాడేపల్లి కేంద్రంగా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడ్డారని కర్నూల్ రేంజి డిఐసి డాక్టర్ కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీం దర్‌రెడ్డి, నేరస్థుడని తెలిసి ఆశ్రయం కల్పించిన మరో ఇద్దరు వెంకట సుబ్బారెడ్డి, అలియాస్ సుబ్బారెడ్డి, ఉదయ కుమార్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు తెలిపారు. సోమవారం డిపిఒలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ముగ్గురు నిందితులను మీడియా ముందు హాజరుపరచారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం, వేముల మండలం, కొంద్రెడ్డి పల్లి గ్రామానికి చెందిన వర్రా రవీందర్‌రెడ్డి ఏడేళ్లుగా సంవత్సరాల నుంచి వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర సోషయల్ మీడియా ద్వారా వైసిపి వ్యతిరేకులైన వివిధ పార్టీల నాయకులు, మహిళలపై అబద్ధపు, అశ్లీల మార్ఫింగ్ ఫొటోలు, కంటెంట్ పెడుతూ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించాడని తెలిపారు. దీనివల్ల వివిధ కులాలు, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి సమాజంలో అశాంతిని, శాంతి భద్రతల సమస్యలు సృష్టిస్తున్నాడని తెలిపారు. ఈ నెల 8న పులివెందల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌సి వర్గానికి చెందిన హరి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు కడప జిల్లా ఇన్‌ఛార్జీ ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పులివెందుల డిఎస్‌పి పి.మురళీనాయక్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. దర్యాప్తులో భాగంగా వర్రా రవీందర్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు 3 బృందాలు రంగంలోకి దిగాయని చెప్పారు. వివిధ ప్రాంతాల్లో వర్రా ఆచూకీ కోసం గాలిస్తుండగా ఈ నెల 10న రాత్రి 11.35 గంటలకు ప్రకాశం జిల్లాలోని కుంట-ఆత్మకూరు పోవు రహదారిలో జమ్మలమడుగు అర్బన్ సిఐ లింగప్ప ఆధ్వర్యంలో బృందం వాహన తనిఖీలు చేస్తుండగా వర్రా, ఆశ్రయమిచ్చిన మరో ఇద్దరు ప్రయాణిస్తున్న కారును, వారిని పట్టుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కుటుంబ సభ్యులు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, కుటుంబ సభ్యులు, టిడిపి మహిళా నేతలే లక్ష్యంగా వికృతచేష్టలు ప్రళయతాడవం చేసేవారన్నారు. వర్రా రవీందర్‌రెడ్డి వివరాలు పరిశీలిస్తే..ఇతను భారతీ సిమెంట్‌లో ఉద్యోగి అన్నారు. 2019లో ఉద్యోగం మానేసి పూర్తిస్థాయి వైసిపి కార్యకర్త కింద సోషల్ మీడియా వింగ్‌లో జిల్లా కన్వీనర్ వివేకర్‌రెడ్డి కింద కో-కన్వీరర్‌గా పని చేసేవాడని పేర్కొన్నారు. 2020లో ఎపి డిజిటల్ కార్పొరేషన్ అని ప్రభుత్వ రంగ సంస్థ అప్పటి ప్రభుత్వ చిన్నవాసుదేవరెడ్డి మీడియా చానల్ యజమాని కింద పని చేసేదని తెలిపారు. కోవిడ్ సమయంలో సజ్జల భార్గవ రెడ్డి ఆరంగేట్ చేసి సోషల్ మీడియా వ్యవస్థను ఒక్కతాటిపైకి తీసుకువచ్చి సజ్జల భార్గవ్ బూతుపురాణాలు మొదలుపెట్టారని చెప్పారు. 45 మందిని వీరి ముఠాలో గుర్తించామని తెలిపారు. వీరిపై సైబర్‌క్రైం రిలేటెడ్ సెక్షన్‌ల కింద కేసుపెట్టామని తెలిపారు. అవినాష్‌రెడ్డి పిఎ బండి రాఘవరెడ్డికి ఆయన వాట్సప్ నంబరు ద్వారా కంటెంట్ ఇస్తారని తెలిపారు. సమావేశంలో ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు, ఎఎస్‌పి సత్యప్రకాష్, కడప, పులివెందుల డిఎస్‌పిలు వెంకటేశ్వర్లు, మురళీ నాయక్ పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిఐజి కోయ ప్రవీణ్

న్యూమోనియా లేని సమాజ స్థాపనే లక్ష్యం

ప్రజాశకి-రాయచోటి టౌన్

న్యూమోనియా వ్యాధి రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. సోమవారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో ప్రపంచ న్యూమోనియా దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం నవంబర్ 12న ప్రపంచ న్యూమోనియా దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఊపిరితిత్తులలో అసాధారణ ద్రవం చేరడం వల్ల శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిని కల్గించే పరిస్థితిని న్యూమోనియా అంటారని అనానరు. సోమవారం నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు సాన్స్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సాన్స్ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, సిహెచ్ఒలు న్యూమోనియాపై ఇంటింటి సర్వే చేస్తారని చెప్పారు. మూడు బృందాలుగా ఇంటింటికి వెళ్లి ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించి వారికి న్యూమోనియా లక్షణాలు ఉంటే పిహెచ్‌సి తరలిస్తారని చెప్పారు. న్యూమోనియా వ్యాధి వల్ల ప్రతి సంవత్సరం దేశంలో పిల్లల మరణాలు 17.5 శాతం నమోదు అవుతున్నాయని న్యూమోనియా ఎక్కువగా ఐదేళ్లలోపు పిల్లలు, 60 సంవత్సరాలు పైబడిన వారికీ సోకుతుందని అన్నారు. అనంతరం న్యూమోనియా రావడానికి గల కారణాలు, లక్షణాల గురించి వివరించారు. జిల్లా లోని క్షేత్ర స్థాయిలో విరివిగా న్యూమోనియా పై అవగాహన సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్య వంతం చేస్తామని చెప్పారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ కొండయ్య

మైనార్టీలలో విద్యా చైతన్యం వెల్లివిరియాలి :ఎమ్మెల్యే

అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మైనార్టీలలో విద్యా చైతన్యం వెల్లివిరియాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అకాంక్షించారు. సోమవారం విజయవాడలోని తుమ్మవారి కళాక్షేత్రంలో జరిగిన మైనార్టీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మైనార్టీలలో అక్షరాస్యతా శాతం తక్కువగా ఉందని, వారు చదువులో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం మైనార్టీల విద్యాభివృద్ధికి, వారి సంక్షేమానికి పెద్దపేట వేస్తోందని కొనియాడారు. మైనార్టీలు తమకు అందివచ్చిన అవకాశాలను చక్కగా సద్వినియోగం చేసుకొని, అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. అనంతరం ఉర్దూ పాఠశాలలు, భాషాభివృద్ధికి కృషి చేసిన వారికి వివిధ విభాగాల్లో అవార్డులను అందించారు. కార్యక్రమంలో మైనార్టీ, న్యాయశాఖ మాత్యులు ఎన్.ఎం.డి.ఫారూఖ్, సత్యప్రసాద్, ఎమ్మెల్యే లు నజీర్ అహ్మద్, శ్రీనివాస రావు, మైనార్టీ వ్యవహారాల సలహాదారులు ఎం.ఎ.షరీఫ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముష్తాక్ అహ్మద్, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షుబ్లీ, వివిధ జిల్లాలకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయులు, భాషాభిమానులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి పాఠశాల స్థలాన్ని కాపాడాలి

ప్రజాశక్తి-రాయచోటి

రాజంపేట పట్టణంలో మెట్టమీద పల్లె గ్రామపంచాయతీలో యూత్ ట్రైనింగ్ సెంటర్ ఆంధ్ర ప్రదేశ్ గిరిజన ఆశ్రమ పాఠశాల స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి పేర్కొన్నారు. పాఠశాల సర్వే నెంబర్ 1205లో ఏడు ఎకరాల స్థలాన్ని కేటాయించారని తెలిపారు. ఈ పాఠశాలకు కేటాయించిన స్థలంలో కొందరు 1205 సర్వే నెంబర్లు రెవెన్యూ అధికారులు అండదండలతో ప్రభుత్వ పాఠశాల స్థలం కబ్జాదారులు 30 సెంట్లు వరకు ఆక్రమించుకున్నారని అన్నారు. వెంటనే ఆ స్థలానికి రక్షణ గోడ ఏర్పాటు చేసి ఆ స్థలాన్ని కాపాడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కి వినతి పత్రం సమర్పించారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎపిఆర్‌జెసి రెసిడెన్షియల్ , కెజిబివి, అంబేద్కర్ గురుకులాల్లో ప్రతినెల వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్యంపైన అవగాహన కల్పించాలని కోరారు. శీతాకాలం కాలంలో విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ విద్యార్థులకు అధించే పౌష్టిక ఆహారాన్ని అందించి రోగనిరోధక శక్తిని పెంచాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాయచోటి నాయకులు సతీష్, పవన్, కార్తీక్, సాయికార్తీక్ పాల్గొన్నారు.

జెసికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మాట్లాడుతున్న నరేంద్రబాబు

14న మాదిగల ఆత్మీయ సదస్సుకు తరలిరండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఈ నెల 14న మదనపల్లిలో చౌడేశ్వరి కల్యాణ మండపంలో జరుగనున్న మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాని ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలకు, నాయకులకు, ఇతర ప్రజాస్వామ్యవాదులకు ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు సొట్ట నరేంద్రబాబు మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం ఎంఆర్‌పిఎస్ మండల ఇన్‌ఛార్జి రెడ్డి నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఎంఆర్‌పిఎస్ మండల సమావేశానికి ముఖ్యఅతిథిగా నరేంద్ర బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సూరిపాక వాసుదేవరావు సంయుక్తంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ అధినేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్‌సి వర్గీకరణ కోసం గత 30 సంవత్సరాలుగా చేస్తున్న పోరాటం సుప్రీంకోర్టు ద్వారా సాధించారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుప్రీంకోర్టు ఆదేశాలు అమలుకు రంగం సిద్ధమవుతున్న తరుణంలో మదనపల్లికి మందకృష్ణ వస్తున్న సందర్భంగా వేలాది ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు, నాయకులు, మాదిగలు కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి మండల సీనియర్ నాయకులు శ్రీనివాస్, శేషాద్రి, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజశేఖర్, గణేష్, కొమ్ము వెంకటేష్, వినోద్, బి.వెంకటేష్, రెడ్డప్ప పాల్గొన్నారు. **రామసముద్రం** :మాదిగల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ మదనపల్లె ఆత్మీయ సమ్మేళన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేయుచున్న సందర్భంగా మండలంలోని మాదిగలు మదనపల్లె సమావేశానికి తరలి వచ్చి ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమం ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులు గంగాధర, ఎంఎస్‌పి ఇన్‌ఛార్జి కొండప్ప, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రవీంద్ర, రాజేష్, సుధాకర్ పాల్గొన్నారు.

రేపు ఆర్థిక ప్రణాళికలపై శిక్షణ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో ఈనెల 13న గ్రామ పంచాయతీలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను గ్రామపంచాయతీ డెవలప్మెంట్ ప్లానింగ్ తయారు చేయుటకు జడ్‌పి సిఇఒ ఆదేశాల మేరకు ఒక్కరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ జాషువా తెలిపారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, 10 ఎంపిటిసిలు, జడ్‌పిటిసి, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు శిక్షణ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. గ్రామాల అభివృద్ధి కావాల్సిన ప్రణాళికలు తయారు చేయుటకు ఈ శిక్షణను ఎంత ఉపయోగించుకొని గ్రామాభివృద్ధి కావలసిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. **గాలివీడు:** గాలివీడు గ్రామపంచాయతీ, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి ప్రణాళిక పై బుధవరం ఉదయం 9 గంటలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జవహర్ బాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసి, కో-ఆప్షన్ నెంబర్, వార్డు మెంబర్లు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఎస్‌హెచ్‌జి, విఒలు హాజరుకావాలన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలో వెలసి ఉన్న శివాలయం వద్ద కార్తీక మాసం రెండో వారం పురస్కరించుకొని ఆర్.వడ్డీపల్లి గ్రామానికి చెందిన మందపల్లి రవి దంపతుల ఆధ్వర్యంలో పూజారి శివప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం దాదాపు వెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అన్నదానం చేయడం గొప్ప భాగ్యమని అన్నారు. కార్యక్రమంలో పల్లపు జనార్ధన, హరినాథ్, గురవయ్య, కావేటి వెంకటరమణ పాల్గొన్నారు.

జనాలతో కిటకిటలాడిన మల్లయ్యకొండ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : మండల కేంద్రానికి సమీపంలో మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయం సోమవారం భక్తుల తో కిటకిటలాడింది. కార్తీక మాసం రెండవ సోమవారం కావడంతో భక్తులు మల్లయ్య కొండపై కేదారేశ్వర స్వామి వ్రతాన్ని నిర్వహించారు. పూజారి ఈశ్వరప్ప, మల్లి కార్జునలు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందించారు. భక్తుల సౌకర్యార్థం రెండు బస్సులను ఏర్పాటు చేశారు.

నాయని గిరిధర్‌కు అరుదైన గౌరవం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేటకు చెందిన ప్రముఖ చిత్ర కళాకారుడు నాయిని గిరిధర్‌కు అరుదైన గుర్తింపు లభించింది. ప్రముఖ రచయిత కళాసాగర్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అత్యద్భుత ప్రతిభావంతులైన వివిధ రంగాలలోని కళాకారులను గుర్తించి 'ఆర్ట్ ఆఫ్ ఎపి' అనే పుస్తకాన్ని విజయవాడలోని భవానిపురం, హరిత బెర్మ్ పార్క్ కాన్ఫరెన్స్ హాల్లో పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సివి.రాజు, గిరిజన గీత శిల్పి ఆర్ట్ ఆఫ్ ఎపి ఎడిటోరియల్ బోర్డు సభ్యులు బొండా జగన్మోహన్రావు, విశాఖ ఎయుడిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ ఆర్ట్ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ వి.రమేష్, కవి గంటేడ గౌరు నారాయణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని కళాకారులను అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక కాబడిన 300 మంది కళాకారులలో అన్నమయ్య జిల్లా నుంచి నాయిని గిరిధర్ ఉండటం రాజంపేట ప్రాంతానికే గర్వకారణమని, ఆయన భవిష్యత్తులో మరిన్ని అరుదైన రికార్డులు నెలకొల్పి ఈ దేశానికి, ఈ ప్రాంతానికి వన్నెతెవాలని రాజంపేట వాసులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-పీలేరు

బాలల దినోత్సవం సందర్భంగా పీలేరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పీలేరు పట్టణ పరధిలోని 18 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి వారికి బహుమతులను ప్రదానం చేశారు. వ్యాస రచన పోటీలో ఇండియన్ బీచ్ స్కూల్ విద్యార్థి ఎస్ఎండి అఫాన్ ప్రథమ స్థానం, విఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాల విద్యార్థి సి.గిరీష్ ద్వితీయ స్థానం, శ్రీ కాకతీయ స్కూల్ విద్యార్థి జి.సాత్విక్ తృతీయ స్థానం సాధించారు. వక్తృత్వ పోటీల్లో ఎంజెపిఎపిబిసిడబ్ల్యూఆర్ పాఠశాల ఎన్. చేతన ప్రథమ స్థానం, శ్రీ కాకతీయ స్కూల్ విద్యార్థి పి.సన ద్వితీయ స్థానం, విఎస్ఎన్ పాఠశాల విద్యార్థి ఎ.చరణ్ కుమార్ తృతీయ స్థానం లభించింది. చిత్రలేఖన పోటీల్లో పట్టణంలోని ఎవిఆర్ స్కూల్ విద్యార్థి చాందినీ రావత్ ప్రథమ స్థానం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని పి.శశికళ ద్వితీయ స్థానం, జడ్‌పి ప్రధాన ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్. అఫ్రోజా శ్రీ భువన విద్యాలయం విద్యార్థినిలు తృతీయ స్థానంలో నిలిచారు. క్విజ్ పోటీల్లో విఎస్ఎన్ సిద్ధార్థ స్కూల్ ప్రథమ స్థానం, జడ్‌పి ఉర్దూ ఉన్నత పాఠశాల ద్వితీయస్థానం, శ్రీచైతన్యస్కూల్ తృతీయ స్థానం సాధించి బహుమతులు గెలుచుకున్నాయి. విజేతలకు సుమారు రూ.15వేలు ప్రైజ్ మనీతో పాటు ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ విఎస్ఎన్ ప్రసాద్, ప్రెసిడెంట్ మహేష్ గుప్త, కార్యదర్శి చింతల విజయభాస్కర్ రెడ్డి, ట్రెజరర్ చెంగయ్య, ప్రోగ్రామ్ ఆర్గనైజర్లు సుధాకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, భానుమూర్తి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న చేస్తున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు

విద్యా ప్రధాత మౌలానా అబుల్ కలాం ఆజాద్

ప్రజాశక్తి-మదనపల్లి

జాతీయ విద్యా దినోత్సవం అబుల్ కలాం ఆజాద్ జయంతది సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మదనపల్లిలో ఉర్దూ ఉపాధ్యాయులు కౌసర్ భేగం ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు పుణ్యవతి ఆధ్వర్యంలో జరిగినది. కౌసర్ బేగం మాట్లాడుతూ మొట్టమొదటి భారతదేశం విద్యాశాఖ మంత్రిగా పనిచేసేన వ్యక్తి అబుల్ కలాం అని తెలిపారు. కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్, సాహిత్య అకాడమీ, లలిత కళాకారుని సంగీత నాటక అకాడమీ, సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ వీటిని స్థాపించారు. అబుల్ కలాంకు భారతరత్న 1992 భారత ప్రభుత్వం ఇచ్చి సత్కరించిందని అన్నారు. ఈ సమావేశంలో సోషియల్ ఉపాధ్యాయులు అన్వర్‌బాషా, సోమశేఖర్ యూటిఎఫ్ నాయకులు గాలి రవీంద్ర, టి.సుధాకర్ నాయుడు, ముబారక్ బాషా పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితాన్ని దేశ యువత, విద్యార్థులు, ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. భారతరత్న అబుల్ కలాం ఆజాద్ దేశ సమగ్రత కోసం, హిందూ ముస్లింల ఐక్యత కోసం పాటుపడ్డారన్నారు. ఉర్దూను రెండవ అధికార బాషగా గతంలో జగన్ ప్రభుత్వం గుర్తింపు నిచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. **పట్టణంలోని మదరస-ఏ-అయేషా నిస్వాన్‌లో..** మౌలానా అబుల్ ఆజాద్ జయంతి వేడుకలకు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి షేక్ అఫ్తాబ్ మాట్లాడుతూ ఆయన తన 12వ ఏటా 'న్నెరంగ్-ఎ-ఆలం' పత్రికను వెలువరించారని ఆయన 13వ సంవత్సరంలోనే అద్భుత సాహిత్య విమర్శను సృజియించి 'విద్యాగని, సలక్షణ శోభితుడు, మహాకవి, సాటిలేని విద్వాంసుడు'గా ప్రశంసలందుకున్నారన్నారు. కార్యక్రమం లో రాయచోటి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు నాసర్, సభ్యులు, ముహమ్మద్, నియాజ్ ,జీలాన్ బాషా, మదరసా నిర్వాహకులు షేక్ హుసైన్, ఫర్హాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్రమైన కలకడలో జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలో కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని

పుల్లంపేట:మౌలానా అబుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రినిపల్స్, ప్రధానోపాధ్యాయులు మౌలాలా అబుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల కేంద్రమైన కలగడంలోని శ్రీ చైతన్య ప్రయివేట్ పాఠశాలలో జాతీయ నాయకుల ఫోటోలతో ర్యాలీ నిర్వహించి ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించుకున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను పాఠశాల ఉపాధ్యాయులు రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి ని పురస్కరించుకొని విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున, ఈశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో సోమ వారం జాతీయ విద్యాదినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిటి.శ్రీనివాస్ తన ప్రసంగంలో దేశ మొదటి విద్య శాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ దీప్తికిరణ్, డాక్టర్ నిశ్చల పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపు ఆలోచనను విరమించుకోవాలి

రాయచోటి : నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాష్ట్రంలో సర్దుబాటు పేరుతో కూటమి ప్రభుత్వం పెంచాలనుకున్న విద్యుత్ అదనపు చార్జీల ఆలోచనలను వెంటనే విరమించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఎపిఎస్‌పిడిసిఎల్ వద్ద డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా 7 నియోజకవర్గాల్లో పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు డిసిసి అధ్యక్షుడి నేతృత్వంలో నిరసనకార్యక్రమాలు జరిగాయి. విద్యుత్ చార్జీలసర్దుబాటు చార్జీలు పెంచాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, గ్రామ, మండల, నియోజకవర్గ నాయకులు భారీ స్థాయిలో నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లలో 7 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, వినియోగదారుల నడ్డి విరగొ ట్టారని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు సర్దుబాటు పేరుతో వినియోగదారులపై భారం మోపాలను కోవడం దారుణమన్నారు.. తమ ఆలోచన లను వెంటనే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ ఇంజినీరింగ్ ఎపిఎస్‌పిడిసిఎల్ డిప్యూటీ ఇఇ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చాన్‌భాషా, అమీర్‌బాషా, ఖాదర్‌ఖాన్, నాగలత, నవీన్, నజీర్, జాఫర్ సాదిక్, అర్షద్‌అలీ పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోసాలదేవి రాష్ట్ర నాయకులు ఎన్.శాంతయ్య డిమాండ్ చేశారు. పెరిగిన కరెంటు చార్జీలతో ప్రజలు అంథాకారంలో బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వైసిపి హయాములో రూ. 35వేల కోట్లు సర్దుబాటు చార్జీలు పేరుతో ప్రజల నుంచి వసూలు చేశారని ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా 5 నెలల్లోనే రూ 17వేల కోట్ల భారం మోపుతుందని అన్నారు. కార్యక్రమంలో మండలం నాయకులు సిగమాల రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు రవి,నియోజకవర్గ విద్యార్థి నాయకులు సిగమాలశివ, బొమ్మి రాజేష్,ఉప్పుటూరు బ్రహ్మయ్య, ఆదిలక్ష్మి, చరణ్ పెంచలయ్య, కళ్యాణ్, జగదీష్, వినోద్ పాల్గొన్నారు.

అపార్‌ను త్వరగా అప్‌డేట్ చేయండి:ఎంపిడిఒ

ప్రజాశక్తి-గాలివీడు

అపార్‌ను త్వరగా అప్‌డేట్ చేయాలని ఎంపిడిఒ సి.ఎ.జవహం బాబు తెలిపారు. సోమవారం ఎంపిడిఒ ఛాంబర్ లో ఎంఇఒలు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులకు జనన ధృవీకరణ పత్రం కావాలంటే ఆ గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా నేరుగా పొందే అవకాశం ఉందని అన్నారు. ఈ అవకాశాన్ని సకాలంలో పూర్తి చేయించాలని పేర్కొన్నారు. గాలివీడు ఒక్క తపాలా కార్యాలయంలోనే ఆధార్ అప్‌డేట్ జరుగుతున్నదని నూలువీడు, గాలివేడు ఆధార్ సెంటర్లలో లాగిన్ ఇవ్వక పోవడం ద్వారా సమస్య అలానే ఉందని ఉపాధ్యాయులు ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లారు. రాత్రి 10 గంటల వరకు విద్యార్థుల తల్లిదండ్రులు పడిగాపులు పడే పరిస్థితి ఏర్పడుతున్నదని వీటిపై దృష్టి పెట్టి జిల్లా అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు చొరవ చూపాలని ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒలు ఎండిఒను కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 పిల్లి. నాగరాజు,

ఎంఇఒ, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఎంఇఒ-2 శ్రీనివాసులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గేశ్వరరాజూ, వెంకటరమణ, వెంకట రమణారెడ్డి, ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ జయచంద్రారెడ్డి, ఉపేంద్ర, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల విషయంలో సహాయకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిడిపిఒ రాజమ్మ తెలిపారు. ఐసిడిఎస్ పీలేరు ప్రాజెక్టు కార్యాలయం ఆవరణంలో సోమవారం ఆమె అంగన్వాడీ సహాయకులకు ప్రాజెక్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ అంగన్వాడీ సహాయకులు ప్రతిరోజు ఉదయం 9 గంటలకే కేంద్రాలను తెరచి శుభ్రం చేసి విద్యార్థులను తీసుకురావాల్సి ఉంటుందని అన్నారు. సాయంత్రం 4గంటల వరకు అంగన్వాడి కేంద్రాలను నడపాలని ఆదేశించారు. అదేవిధంగా కేంద్రాల్లో నిర్వహించాల్సిన వేర్వేరు కార్యక్రమాల గురించి వివరించారు. ప్రీ స్కూల్ పిల్లల హాజరు ఖచ్చితంగా ఉండాలని, ప్రతిరోజూ సెంటర్లలో మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని వండి పిల్లలకు పెట్టాలని, స్కూల్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం హెల్ప్ లైన్ గోడ పత్రికలను ఆవిష్కరించారు. వీటిని ప్రతి సెంటర్లోనూ కనబడేలా ఉంచాలని సూచించారు. 5 ఏళ్ల వయస్సు వరకు పిల్లలకు ప్రతినెలా విధిగా బరువు, ఎత్తు చూసి రికార్డులలో నమోదు చేయాలని

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఆదేశించారు. అనంతరం ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు సాటర్‌స్కేల్స్, స్టేడియో మీటర్లు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు స్వరూప, స్వర్ణ, శాంత, అన్నపూర్ణ, భారతి పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు :డిఎస్‌పి

మాట్లాడుతున్న డిఎస్‌పి కొండయ్యనాయుడు

ప్రజాశక్తి-ములకలచెరువు

అక్రమ ఇసుక తరలింపు, గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహణ జరిపితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మదనపల్లి డిఎస్‌పి కొండయ్య నాయుడు తెలిపారు. సోమవారం ములకలచెరువు మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనాల తనిఖీ, పోలీసుస్టేషన్నక్ష కేసులు పెండింగ్ లేకుండా చూడాలని, న్యాయం కోసం వచ్చే ప్రజలకు ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని సూచించారు. బెల్ట్ షాపుల నిర్వహణ జరగకుండా సిఐ, ఎస్‌ఐలకు ఆదేశించారు. ఈ సందర్భంగా విలేకరులతో డిఎస్‌సి మాట్లాడుతూ ఏడాదికాలంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించడం జరిగిందని, మండలంలో రెండు హత్యకేసుల్లో నిందితులను వెంటనే పట్టుకుని కేసులు నమోదు చేసి పురోగతి సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఉచిత ఇసుక సరఫరా చేసేందుకు సన్న హాలు చేయడం జరిగిందన్నారు. కొందరు అక్రమ ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహించేందుకు ప్రయత్నించే వారిపై చర్యలు తప్పవన్నారు. జాతీయ రహదారిలో అక్రమ ఇసుక తరలింపు, ఎర్రచందనం వంటవి ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లకుండా సత్య సాయి-అన్నమయ్య జిల్లాల సరిహద్దు జాతీయ రహదారిలో చెక్ పోస్టులు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాలలో ఎవరైనా అక్రమ మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపులు నిర్వహిస్తుంటే ప్రజలు పోలీసుస్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. డిఎస్‌పి వెంట సిఐ రాజా రమేష్, ఎస్ఐ గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయత స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రాజంపేట క్రీడాకారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈనెల 8, 9,10వ తేదీలలో నంద్యాలలో జరిగిన అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ పోటీలలో కడప జిల్లా జట్టు నుంచి ప్రతిభ కనబరిచి రాజంపేటకు చెందిన క్రీడాకారులు బావుద్దీన్, భానుచందు, సోనియాలు జాతీయస్థాయికి ఎంపికై ఫెడరేషన్ ప్రాబబుల్స్ లో చోటు సాధించినట్లు ఉమ్మడి కడపజిల్లా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.కృష్ణమూర్తి, జీ.వెంకటరమణలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.సోనియా రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేశారని, ఫెడరేషన్ ప్రాబ్లమ్స్ లో చోటు సాధించడంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

నిమ్మనపల్లిలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల కేంద్రమైన నిమ్మనపల్లిలో ట్రాఫిక్ నియంత్రణకు స్థానిక పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి సోమవారం నిమ్మనపల్లిలో వారపు సంత జరుగుతున్నందున నిమ్మనపల్లిలోని అభయాంజనేయ దేవస్థానం నుంచి బస్టాండ్ మీదుగా తవళం రోడ్డు కూడలి వరకు ఓవైపు వ్యాపారస్తులు రోడ్డుపైనే వ్యాపార దుకాణాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు ద్విచక్ర వాహనదారులను, ఆటోలను ఇష్టానుసారంగా రోడ్డుకు ఇరువైపులా నిలుపుతున్నందున ఇతర వాహనాలకు, ఆర్‌టిసి బస్సులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. ట్రాఫిక్ అంతరాయం కారణంగా అత్యవసర వాహనాలు వెళ్లాలన్న వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు తమ నిత్యవసర సరుకులను కొనుక్కోవడానికి సంతలోకి నడుచుకుంటూ వెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. నిమ్మనపల్లిలో ఏర్పడిన ట్రాఫిక్ ను నియంత్రించడానికి ఇప్పటికైనా స్థానిక పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని జయశ్రీ కాలనీలో నివాసం ఉంటున్న తుమ్మగింజల వెంకటరమణ ఇంటి ఆవరణంలో బ్రహ్మ కమలాలు విరగబూశాయి. సహజంగా ఒకటి, రెండు, మూడు పూలు మాత్రమే ఇవి పూస్తాయి. అలాంటిది తుమ్మగింజలు వెంకటరమణ ఇంటి ఆవరణంలో చాలా పూలు విరబూయడంతో ఈ పూలను స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ మా ఇంటి ఆవరణంలో బ్రహ్మ కమలం చెట్టు ఉందని, సాధారణంగా ఒకటి నుంచి మూడు పూలు మాత్రమే వస్తాయని అన్నారు. ఈ ఏడాది చాలా ఎక్కువ సంఖ్యలో పూలు పూస్తాయని చెప్పారు. ఈ అరుదైన దృశ్యానికి వఇల్లు వేదిక కావడం ఆనందంగా ఉందని అన్నారు.

బ్రహ్మ కమలాలు

విఆర్‌ఎ సంఘం నాయకుడు లింగారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని కరిమిరెడ్డిగారిపల్లి గ్రామాసేవకునిగా 24 సంవత్సరాల నుంచి సేవలందించిన సి.లింగారెడ్డి మృతి చెందడం విఆర్‌ఎ సంఘానికి తీరని లోటని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. సోమవారం సిఐటియు జిల్లా కమిటి తరుపున లింగారెడ్డి భౌతిక కాయానికి ఉపాధ్యక్షులు ఓబుళమ్మ మండల కార్యదర్శి లక్ష్మిదేవిలతో పాటు గ్రామసేవకుల సంఘం నాయకులు బోగేశ్వరయ్య, నారాయణ, రాజన్న, కుమార్, రెడ్డెప్ప గ్రామ సేవకులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విఆర్‌ఎ సంఘానికి లింగారెడ్డి మండల అధ్యక్షునిగా, సిఐటియు నాయకులుగా ఉద్యమానికి చేసిన సేవలను కొనియాడారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో సోమవారం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేస్తుందని అన్నారు. ప్రతి సమస్యను ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని సూచించారు. ప్రజలు సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతోఅధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, ఎస్‌డిసి రామసుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నిర్మాణ రంగం కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు గాలి చంద్ర, సలీం బాషాలు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఎఐటియుసి రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 12న రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు నేటికీ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడుస్తున్నా నేటికీ భవణ నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీపై మాట్లాడలేదని అన్నారు. ఇంతవరకు అనేకసార్లు జరిగిన మంత్రివర్గ సమావేశాలలో నిర్మాణ రంగం కార్మికులపై ఏమాత్రం చర్చ కూడా జరపలేదని ఆరోపించారు. సోమవారం నుంచి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో నిర్మాణ కార్మికులపై చర్చించి సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సుదీర్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

పేదల పేరుతో ఇళ్లు అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

పేదల పేరుతో ఇంటి స్థలాలు తీసుకుని అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిబిఎస్ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు బద్దె భానుప్రకాష్ కోరుతూ సోమవారం జిల్లా జాయింట్ కలెక్టరుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పీలేరు మండలంలోని బోడుమల్లువారిపల్లి పంచాయతీ పరిధిలో ఎంతమంది నిరుపేదలకు పక్క గృహాలు అందించారని ప్రశ్నించారు. కొందరు నాయకులు విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని ఇంటి పట్టాలు కూడా లేకుండా ఇతరులకు లక్షలాది రూపాయలకు అమ్ముకున్న వ్యక్తులపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు చెప్పారు. ముందుగా ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం పై విచారణ చేపట్టాలని జెసికి విజ్ఞప్తి చేసుకున్నట్లు చెప్పారు. పంచాయితీ పరిధిలో పక్కా గృహాలు లేని వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలన్నారు. బయట మండలాల నుంచి వచ్చి తమ పంచాయతీలో ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిపై విచారణ జరిపి తిరిగి స్వాధీనం చేసుకోవాలని అధికారులను కోరారు.

జెసికి వినతిపత్రం సమర్పిస్తున్న డిబిఎస్ఎఫ్ నాయకుడు భాను ప్రకాష్